

## రండి సార్..రండి..

బుధవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 13 మార్చి 2025 | HYDERABAD







hmda
Growing Global

## 14 జిల్లాలు.. 14 మండలాలు

### హెచ్ఎండీఏ విస్తరణ

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిని విస్తరించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడు జిల్లాలున్న హెచ్ఎండీఏలో మరో నాలుగు జిల్లాలను విలీనం చేస్తూ మొత్తంగా 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో 10472 చదరపు కిలోమీటర్లకు పరిధిని విస్తరించింది. దీంతో హెచ్ ఎండీఏ పరిధి ఓ ఆర్ ఆర్ నుంచి త్రిబుల్ ఆర్ వరకు చేరనున్నది. తాజా ఉత్తర్వుల్లో విలీన గ్రామాలు, మండలాలు జిల్లాల వారీగా జాబితాను వెల్లడించింది. కొత్తగా హెచ్ఎండీఏ పరిధిలో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వికారాబాద్, నల్గొండ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు జాబితాలో చేరిపోయాయి. దీంతో అదనంగా 3వేల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ ఆధీనంలోకి చేరింది.

## వ్యర్థాల డంపింగ్‌కు అడ్డుకట్ట




జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట డివిజన్‌లోని హెచ్ఎండీఏ స్థలంలో వ్యర్థాల డంపింగ్‌కు అడ్డుకట్టపడింది. 'హైడ్రా పేరిట వసూళ్లు' శీర్షికతో 'నమస్తే'లో ప్రచురితమైన కథనంతో సంబంధిత వ్యక్తుల్లో కదలిక వచ్చింది. వ్యర్థాలు తరలించే వాహనాలు లోపలికి వెళ్లకుండా ప్రవేశ మార్గంలో కర్రలు, చెక్కలు అడ్డుపెట్టారు. స్థలం వద్ద అనధికార వ్యక్తులను తొలగించి.. ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా ఇక్కడ హైడ్రా కూల్చిన వ్యర్థాల పోస్తున్నామంటూ.. నమ్మ బలుకుతూ ,అక్రమ నిర్మాణ వ్యర్థాలను ట్రాక్టర్లు , టిప్పర్లతో డంపు చేస్తున్నారు. ట్రిప్పుకి రూ.300 నుంచి 500 రోజుకు సుమారు రూ. లక్ష మేర సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని నెలలుగా సాగిన వసూళ్ల తతంగం వెనుక ఓ కానిస్టేబుల్, హోంగార్డుతో పాటు హెచ్ఎండీఏలో సివిల్ వర్క్ చేసే కాంట్రాక్టర్ పాత్ర ఉన్నట్లు తెలుస్తున్నది.

## రేపు మద్యం దుకాణాలు బంద్




సిటీబ్యూరో: హోలీ సందర్భంగా ట్రై కమిషనరేట్ పరిధిలో ఈ నెల 14 ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని పోలీస్ కమిషనర్లు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హోలీ రోజు బలవంతంగా రంగులు చల్లడం, రహదారులపై ప్రజలను ఇబ్బంది పెట్టడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, హోలీ సందర్భంగా బీఫ్ దుకాణాలను సైతం ఆ రోజు మూసివేయాలని నిర్వాహకులను బల్దియా అధికారులు ఆదేశించారు.

## వాహన ధరల ఆధారంగా రైడ్ రేట్లు పెట్టండి




సిటీబ్యూరో: యాప్ అగ్రిగేటర్స్ చేస్తున్న మోసాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలంగాణ గిగ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్, తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ చైర్మన్ షేక్ సలావుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓలా, ఉబర్, ర్యాపిడోలు కమీషన్ల పేరుతో డ్రైవర్లను దోచుతకుంటున్నాయన్నారు. దూరానికి తగ్గట్టుగా ధరలు నిర్ణయించకుండా కంపెనీలు డ్రైవర్ల బతుకులతో చెలగాటమాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే నో ఏసీ క్యాంపెయిన్ చేశామని, అందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను తిరస్కరిస్తున్నట్టు చెప్పారు. యాప్ అగ్రిటేటర్స్ తెలంగాణలో కూడా కర్ణాటకలో ఉన్న విధానాలను అమలు చేయాలన్నారు. వాహన ధరలను ఆధారంగా చేసుకుని కర్ణాటకలో రైడ్స్ ధరలు నిర్ణయించారని, అదే విధంగా ఇక్కడ అమలు చేయాలని కోరారు. పది లక్షల లోపు విలువజేసే వాహనాలకు 4 కిలోమీటర్ల దూరానికి రూ.100 రైడ్ ధర ఉండాలని, ప్రతి అదనపు కిలో మీటర్‌కు రూ.24గా నిర్దేశించాలని సూచించారు. 15 లక్షలపై ధర ఉండే వాహనానికి మొదటి 4 కిలో మీటర్లకు రూ.130 ధర ఉండాలని.. అదనపు కిలోమీటర్‌కు రూ.32 చార్జీ చేసేలా రూపొందించాలని కోరారు. ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని, రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

# రేవంత్.. ఖబడ్దార్

## అడ్డగోలు మాటలు మానుకో

### సీఎం వ్యాఖ్యలపై భగ్గుమన్న తెలంగాణ

- రేవంత్‌రెడ్డిది దుష్ట గుణం.. చావే కోరుకుంటారు
- కేసీఆర్‌ది దైవ గుణం.. అందరూ బాగుండాలని ఆశిస్తారు
- సీఎం రేవంత్‌పై విరుచుకుపడిన నెటిజన్లు, తెలంగాణ ప్రజలు



కోట్లాది మంది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు కేసీఆర్. ఎన్నో ఏండ్ల తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారం చేసిన మహోన్నత ఉద్యమ నాయకుడు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఏర్పాటుకు సీమాంధ్ర నాయకులు మోకాలడ్డుతున్న వేళ ఆమరణ నిరాహార దీక్షకు దిగి ప్రాణాలకు తెగించిన గొప్ప పోరాట యోధుడు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని నినదించిన తెలంగాణ కెరటం ఆయన. గల్లీ నుంచి ఢిల్లీ మీదుగా ప్రపంచ దేశాల ప్రజలకు అభిమాన పోరాట యోధుడు కేసీఆర్. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ. సంక్షేమ పథకాలతో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజానీకం, నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

- సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ)





### విజ్ఞతను కోల్పోయి మాట్లాడకు..

రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిపై సీఎం రేవంత్ రెడ్డి తన స్థాయిని మరిచి మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నా. రేవంత్‌కు ఇది మంచిది కాదు.. ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. సీఎం కుర్చీని కూడా ఆయన దిగజార్చి మాట్లాడుతున్నారు. దినదినం విజ్ఞతను కోల్పోతున్నారు.

-క్రిశాంక్, బీఆర్ఎస్ సీనియర్ నేత



రవీంద్రభారతిలో బుధవారం జూనియర్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను ఉద్దేశించి.. మాట్లాడుతూ.. 'మీకు మీరే స్టేచర్ ఉందని ఫీలైతే.. స్ట్రేచర్ మీదకు పంపించారు.. ఇట్లనే చేస్తే ఆ తర్వాత మార్చురీకి పోతారు.' అంటూ అవహేళనగా దూషించారు. రేవంత్ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలను పలువురు నెటిజన్లు తీవ్రంగా ఖండించారు. రేవంత్ రెడ్డిది దుష్ట గుణం.. చావే కోరుకుంటారని.. కేసీఆర్‌ది దైవ గుణం.. అందరూ బాగుండాలని ఆశిస్తారని రఘువీర్ రాథోడ్ అనే వ్యక్తి ఎక్స్ వేదికగా ఖండించారు. మరో నెటిజన్ తిరుపతి మరుపాక 'దమ్ముంటే కేసీఆర్‌ను టచ్ చేసి చూడు' అంటూ సవాల్ విసిరారు. నీచులు ఎప్పుడూ నీచంగానే మాట్లాడుతారని ఫైర్ అయ్యారు. శివ ప్రసాద్ నారాయణ అనే నెటిజన్ స్పందిస్తూ '' అయ్యా గుంపు మేస్త్రీ నీకు స్ట్రేచర్ పదానికి కనీసం స్పెల్లింగ్ తెలుసా'' అంటూ ఎద్దేవా చేశారు. మరో నెటిజన్ స్పందిస్తూ కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టి–మన చిట్టి నాయుడి కోసమే రాసినట్టు ఉంది ఈ పద్యమంటూ రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నెటిజన్ ప్రేమ్ రెడ్డి స్పందిస్తూ.. అయ్యా రేవంత్ నీ పేరు చివరన రెడ్డి అనే పదం తీసెయ్..నువ్వు మాట్లాడే మాటలకు రెడ్డి పరువు పోతున్నది అంటూ ఎద్దేవా చేశారు. మరో నెటిజన్ ప్రభాకర్ స్పందిస్తూ నువ్వు ఎర్రగడ్డకు పోవడం ఖాయమన్నారు. సీఎం రేవంత్‌ను ఉద్దేశించి సంతోష్ అనే నెటిజన్ స్పందిస్తూ.. అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్.. రేవంత్ ఓవరాక్షన్‌కు బ్రేకులు వేయాల్సి ఉండే ..అని అభిప్రాయం వ్యక్తం చేశారు. మరో నెటిజన్ మధురెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటికీ ఇప్పుడు ఎలక్షన్స్ వస్తే 5 సీట్లు కూడా రావని.. ప్రచారం చేయకపోయినా కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మరో వ్యక్తి సంతోష్ స్పందిస్తూ.. ఓటుకు నోటు కేసు ప్రస్తావిస్తూ.. ఇంతకీ 50 లక్షలు బ్యాగ్ ఎక్కడివి అంటూ విమర్శించారు.

### సీఎం వ్యాఖ్యలు దారుణం



తెలంగాణ ఉద్యమ సారథి, రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌ను ఉద్దేశించి అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణం. రాజకీయ పార్టీలకు మధ్య విభేదాలు సహజమే. అయితే తమకు నచ్చని వారికి భౌతికంగా హాని కలగాలని ఆలోచన చేయడం అత్యంత తీవ్రమైన అంశం.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

### అడ్డగోలు మాటలు వద్దు..



మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు తీవ్ర ఆక్షేపనీయం. పెద్ద వారిని తిడితే పెద్దగా ఐపోతానని రేవంత్ భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డిని ప్రజలు వెంటిలేటర్ మీద పడుకోబెట్టారు. తులసీ తీర్థం పోసే సమయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరోసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం దింపుడు కల్లెం ఆశలే. ఇప్పటికైనా అడ్డగోలు మాటలు మాని ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంపై రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలి.

-టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ జగన్మోహన్ రావు

### సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం



మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో వణుకుపుట్టింది. కేసీఆర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. - ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

### దృష్టి మరల్చేందుకే..



ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. తన చేతకాని తనాన్ని ప్రజలకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు తిడుతున్నారు. ప్రతిపక్ష నేతలు ప్రజల పక్షాన పోరాడుతుంటే వాళ్ల మరణాన్ని కోరుకుంటున్న నీచ బుద్ధి సీఎందీ. ఇప్పటికైనా అడ్డగోలు మాటలు మాని ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టాలి. కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. -ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



### పరిపాలన చేతగాక కేసీఆర్ పై విమర్శలా..

పరిపాలన చేతకాకనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిత్యం అబద్ధాలతో కాలం గడుపుతున్నారు. కాంగ్రెస్ హయాంలో 20 వేల ఉద్యోగాలు ఇచ్చి 50 వేల ఉద్యోగాలు ఇచ్చానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారు. - ఎమ్మెల్యే ముఠా గోపాల్

### తెలంగాణ ప్రజలను అవమానించడమే..



మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యాలు సరికాదు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి భాష మాట్లాడడం బాధాకరం. తెలంగాణ ఉద్యమం కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు సైతం త్యాగం చేయడానికి సిద్ధపడిన వ్యక్తిని ఇలా కించపరచడం తెలంగాణ ప్రజలను అవమానించడమే.

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



### బర్తరఫ్ చేయాలి

మాజీ కేసీఆర్‌పై... అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర గవర్నర్ వెంటనే బర్తరఫ్ చేయాలి. భారత రాజ్యాంగం ప్రకారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన... రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలి. ఇద్దరు మహిళా జర్నలిస్టు వార్తలు రాస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపించిన పోలీసులు... రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలి. - ఎమ్మెల్యే కృష్ణారావు


### మీ ప్రభుత్వాన్ని మార్చురీకి తీసుకుపోతారు



మీ ప్రభుత్వాన్ని ప్రజలు స్ట్రేచర్ మీదికి తీసుకుపోతారో, స్ట్రేచర్ మీద నుంచి మార్చురికి తీసుకుపోతారో గమనిస్తూనే ఉన్నారు. ఇది రేవంత్ రెడ్డి దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలి. మీ పరిపాలనకి కాలం చెల్లి సమయం దగ్గర పడింది.

-బీఆర్ఎస్ సీనియర్ నేత గజ్జల నాగేశ్

### బీఆర్ఎస్‌లో చేరిక..



పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందితే... ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో విధ్వంసం జరుగుతున్నదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ చెందిన కాంగ్రెస్ నేతలు బాల్‌రెడ్డి, హనుమాన్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ...కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. - కేపీహెచ్‌బీ కాలనీ



### ఆగి..ఆగి.. సాగి..

ఒకవైపు నడినెత్తిన సుర్రుమంటున్న ఎండ.. మరోవైపు ఆగుతూ..ఆగుతూ..సాగిన ట్రాఫిక్‌తో నగరవాసులు బుధవారం నరకం చూశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సరైన ప్రణాళిక లేకపోవడంతో ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అసలే ఎండతో సతమతమవుతున్న వేళ .. మాసబ్ ట్యాంక్ రోడ్డులో సీఎం కాన్వాయ్ వెళ్లేందుకు ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే ఆపేయడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఎండవేడిమి తాళ లేక అనేక ఇబ్బ ందులుపడ్డారు.